కథ

వెలుగును వలవేసి తనలోకి లాక్కున్నట్లు–కరెంటు పోయింది.

అపార్ట్‌మెంట్లల్లో కూచ్చుని టి.వి సీరియళ్లు చూస్తున్నవాళ్ల 'హో' కారం డిసప్పాయింట్‌మెంట్‌తో ధ్వనించింది. అప్పుడప్పుడే థ్రిల్‌కి అలవాటు పడుతున్న కుర్రవాళ్ళ కీచుగొంతులు ఈలల్లా హుషారుగా వినిపించాయి.

''రేయ్ పోరి రా'' చూపించాడొకడు.

వివేక్ కళ్ళు చీకట్లో మెరిసాయి.

''ఎవర్రా అది''

''రేయ్ నిహా కదరా'' పక్కనున్నవాడు గుసగుసగా అన్నాడు.

వివేక్‌కి కాలేజీలో జరిగిన అవమానం గుర్తుకు వచ్చింది. నిహా అంటే వివేక్ పక్కింటి అమ్మాయి. కాలేజీలో అతనితోపాటే చదువుతోంది. మొన్న ఒకసారి చనువుతో పలకరిస్తే పట్టించుకోలేదు. అతడు దాన్ని అవమానంగా భావించాడు.

ఇప్పుడు అవకాశం దొరికింది.

కరెంటు పోయింది. ఆ వీధిలో జనం ఎక్కువగా లేరు. తనెవరో ఆమె గుర్తుపట్టలేదు. తనను వెంబడించేది ఎవరో ఆమెకు ఇంకా తెలీదు. గుర్తుపట్టదు కూడా. వెంటనే ప్రణాళికను ఆచరణలో పెట్టింది అతని మిత్రబృందం.

ఒకడు ఆమెకు డాష్ ఇస్తూ కదిలాడు. మరొకడు వీపు మీద బలంగా కొట్టాడు. వివేక్ కసిగా ఆమె నడుము ఒత్తి వదిలాడు.

రెప్పపాటుకాలంలో జరిగిన ఆ చర్యలకు ఆ అమ్మాయి బిత్తరపోయి కెవ్వుమంది.

సడెన్‌గా కరెంటు వచ్చింది

వివేక్ చెంప ఛెళ్ళుమంది.

...వెలుగులో ఆ అమ్మాయి ముఖం స్పష్టంగా కనిపించింది.

★★★

''ఏళ్ళు రాగానే సరిపోదు. బుద్ధి, జ్ఞానం కూడా ఉండాలి. కామంతో కళ్ళు మూసుకుపోయి తోడబుట్టిన చెల్లెలని కూడా చూడకుండా–ఛీ..ఛీ..అది కాబట్టి చెంప వాయించి ఊర్కుంది. నేనైతే ఏ రాయో ఎత్తి నీ తల బద్దలు కొట్టేదాన్ని'' ఏడుపుని, కోపాన్ని గొంతులో అదుముకుంటూ అంది కౌసల్య.

''అమ్మా!'' ఏం అనాలో అర్థంకాక అన్నాడు.

''ఛీ..నన్నలా పిలవకు'' అంటూ కోపంగా వెళ్ళిపోయింది.

చెల్లెలు సంధ్య తల డైనింగ్ టేబుల్ మీద పెట్టుకొని ఏడుస్తోంది.

ఎప్పుడూ వివేక్‌ని సపోర్ట్ చేసే తండ్రి కూడా జరిగినదానికి కోపంతో ఊగిపోతున్నాడు.

తెల్లవారితే రాఖీ పండగ.

రాత్రి భారంగా గడిచింది.

ఆ ఇంట్లో యాంత్రికమైన నిశ్శబ్దం చోటుచేసుకుంది. ఎవరి పనులు వాళ్ళు మాట్లాడకుండా చేసుకోసాగారు. ఏడున్నరకు సంధ్య కాలేజీ ఉందంటూ వివేక్ కేసి కనీసం చూడకుండా వెళ్ళిపోయింది. రాఖీ కట్టే ఉద్దేశ్యం లేనట్టు దానితో

# మార్పు!

**మన పెద్దవాళ్ళు చాలా ముందుచూపు గలవాళ్ళు. మనిషి బలహీనతలు, చేసే పాపాలు అన్నింటిని ఆలోచించి బ్రతికేందుకు ఒక పద్ధతిని ఏర్పాటుచేసారు. గతి తప్పకుండా ఉండేందుకు సంస్కారాన్ని నేర్పించారు. అలాగే ఒక స్త్రీ, ఏ పరిచయం లేని పురుషుణ్ణి అన్నయ్య అని పిలవటం.**

తెలిసిపోయింది.

వివేక్ కూడా బయటపడ్డాడు. మొదట స్నేహితుల దగ్గరకు వెళ్దామనుకుని, తరువాత ఆ ఆలోచన విరమించుకున్నాడు. చాలాసేపు ఒంటరిగా పార్కులలో గడిపాడు. ఐస్‌క్రీమ్ పార్లర్‌కి వెళ్ళాడు.

ఎప్పుడూ ప్రేమికులతో నిండిపోయే ఆ హాలు అన్నాచెల్లెళ్ళతో నిండిపోయింది. కానుకలతో అక్కడి అమ్మాయిల ముఖాలు వెలిగిపోతున్నాయి. చెల్లెళ్ళ ఆనందాన్ని చూసి అన్నలు మురిసిపోతున్నారు. సంధ్య గుర్తుకు వచ్చింది. ఆర్డర్ చేసిన ఐస్‌క్రీమ్ అలాగే వదిలేసి అక్కణ్ణించి వచ్చాడు.

..ఇల్లు చేరేసరికి సాయంత్రం ఐదయ్యింది.

''ఏరా, ఇప్పుడు గుర్తొచ్చిందా ఇల్లు'' అమ్మ ఏడుస్తూ అడిగింది.

అతడు సమాధానం చెప్పలేదు. బాధ గొంతులో సుడులు తిరుగుతోంది.

''అది రాత్రంతా ఎంత బాధపడిందో తెలుసా? ఈరోజు నిన్ను తీసుకుని బిర్లామందిర్ వెళ్ళాలని కూడా అనుకుంది. దాని ఖర్మ..'' అంటూ వంటింట్లోకి వెళ్ళిపోయింది.

ఫోన్ మోగింది.

''హలో?'' అన్నాడు.

''నేను వివేక్. నిహాని–''

షాక్ కొట్టినట్లయింది. క్లుప్తంగా ''ఏమిటి?'' అన్నాడు.

''నీతో మాట్లాడాలి. బయటకు వెళ్దాం వస్తావా?''

మరో షాక్. నేను రాను అందామనుకున్నాడు. ''ఎక్కడికి'' అని అడిగాడు.

''బృందావని. సరిగ్గా ఆరుగంటలకి.''

★★★

సాయంత్రం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంది.

అతడు ఆమె ముందు మౌనంగా కూర్చున్నాడు.

''నిన్ను ఇక్కడికి ఎందుకు రమ్మన్నానో తెలుసా?''

''క్లాస్ తీసుకోడానికి''

ఆమె నవ్వింది. ''కాదు. నా అభిప్రాయం చెప్పడానికి. సంవత్సరం క్రితం నువ్వు చేసిన ప్రాక్టికల్ జోక్ అర్థమై నీకు హాట్సాఫ్ చెబ్దామనిపించి రమ్మన్నాను.''

అతడు అర్థం కానట్టు చూసాడు.

''ఆరోజు నేను రాఖీ కట్టడానికి మీ ఇంటికి వస్తే, నువ్వు అసలు కట్టించుకోనన్నావ్. ఎందుకూ అని అడిగితే, మా మమ్మీ మీ డాడీని, మీ మమ్మీ మా డాడీని 'అన్నయ్యగారు' అని పిలుచుకుంటున్నారు. నేను ఎలా రాఖీ కట్టించుకోను అని తల పట్టుకున్నావ్ గుర్తుందా'' అంది నవ్వుతూ.

ఆమె నవ్వుకు అతని బాధ కొద్ది కొద్దిగా కరుగుతోంది.

''నిజం చెప్పాలంటే ఆరోజు నాకు నీమీద చాలా కోపం వచ్చింది. తరువాత ఆలోచిస్తే నువ్వు చెప్పిందాంట్లో తప్పు లేదనిపించింది.''

''అంటే?''

''సింపుల్. ఒక స్త్రీకి, పురుషుడికి మధ్య రిలేషన్స్ గురించి కొన్ని వేల సంవత్సరాలుగా మనవాళ్ళు తర్జన భర్జన పడుతున్నారు. ఇలా 'అన్న


య్యగారు' అంటూ 'ప్రమా ంం లేని చుట్టరికాలు' కలుపుకుని అవత వాళ్ళ గురించి ముందుగా జాగ్రత్తపడడం- నా కు ఫన్నీగా అనిపిస్తోంది.''

నిహా అలా మాట్లాడడం తనికి విచిత్రంగా అనిపించింది.

''మొదట్లో నేను నిన్ను అన్నయ్య అని పిలవాలని ట్రై చేసాను. కాని నువ్వు నాకా ఛాన్స్ ఇవ్వలేదు. నేను అన్నయ్య అని పిలవాలనుకోవటం వెనుక ఉద్దేశ్యం మాత్రం నా సెక్యూరిటీ కోసమే అని తరువాత ఆలోచిస్తే అర్థమైంది. నేను ఇంకా ఆలోచించాను. నిజంగా నువ్వు 'అన్నయ్య' అనే ఫీలింగ్ నాలో కలిగించినపుడ నిన్ను అన్నయ్య అని పిలవటంలో అర్థం ఉంది. కాని నువ్వు నన్ను మరోలా చూస్తున్నావ్. కదూ '' ఆమె గొంతు సన్నగా వణికింది.

అతడు ఇబ్బందిగా కదిలాడు.

''థాంక్స్. ఒప్పుకున్నావ్. మన పెద్దవాళ్ళు చాలా ముందుచూపు గలవాళ్ళు మనిషి బలహీనతలు, చేసే పాపాలు అన్నింటిని ఆలోచించి బ్రతికేందుకు ఒక వ్యవస్థని ఏర్పాటుచేసారు. గతి తప్పకుండా ఉండేందుకు సంస్కారాన్ని నేర్పించారు. అలాగే ఒక స్త్రీ, ఏ పరిచయం లేని పురుషుణ్ణి అన్నయ్య అని పిలవటం. బోర్ కొట్టిస్తున్నానా?''



''లేదు చెప్పు'' అన్నాడు స్ఫూర్తిగా.

ఆమె టాపిక్ మార్చింది. ''వివేక్ నిన్న జరిగిన సంగతి నాకు తెలుసు. నా డ్రస్ బావుందని సంధ్య అడిగి తీసుకుంది. నిన్న ఆ డ్రస్సే వేసుకుంది. అంటే నీ కోపం అంతా నామీద అన్న మాట. తెలియక నీ చెల్లె దానికి బలయింది-ఎనీహౌ ఎందుకంత కోపం నామీద? నీమాట విననందుకా? నీతో స్నేహం చేయనందుకా?''

అతడు చెప్పలేకపోయాడు.

''ఎలా చేయను వివేక్? నువ్వు, నీ మిత్రులు ఎంత ఇన్‌సెక్యూరిటీతో ఉన్నారో తెలిసాక మీతో ఎలా స్నేహం చేసేది. సినిమా స్టార్లు ఎవరు ఎవరెవరితో సంబంధాలు పెట్టుకున్నారో చర్చించుకుంటూ గడిపే మీతో, క్లాస్‌ఫస్ట్ ర్యాంక్ తెచ్చుకునే రవిని పుస్తకాల పురుగని, చాటని ఏకిపారేసే మీతో, ఎలా స్నేహం చేయటం? మాకంటూ కొన్ని హద్దులు ఉంటాయి. నిజం చెప్పనా వివేక్? తన మీద తనకి ఆత్మవిశ్వాసం ఉన్నవాడితో ఏవరైనా స్నేహం చేస్తారు. ఇష్టపడతారు. మీలాంటివాళ్ళను కనీసం ఏ అమ్మాయి 'అన్నయ్య' అని కూడా పిలువలేదు.

నిజం. నిజంగా నిజం. ఆమె చెబుతున్న ఒక్కొక్క మాట అతని వ్యక్తిత్వాన్ని నిలదీస్తోంది. అతడి ఉనికిని ప్రశ్నిస్తోంది.

ఇరవై ఏళ్ళకే అంత మెచ్యూరిటీ తెచ్చుకున్న ఆమెకేసి మెచ్చుకోలుగా చూసాడు. అపకారిని కూడా తన మాటలతో, చేతలతో ఉపకారిగా మార్చుకోగల ఆమె నేర్పుకు మనసులోనే జోహార్లు అర్పించాడు. ఏం చేస్తే ఇలాంటి ఫ్రెండ్ దొరుకుతుంది? ఇకనుంచి నిహా తనకి ఏమౌతుంది. అక్కా? గురువా? ఫ్రెండా?

''నీకో సర్‌ప్రయిజ్'' అంటూ హాండ్‌బాగ్ లోంచి రాఖీ తీసింది.

''కంగారు పడకు. ఇది ఫ్రెండ్‌షిప్ బాండ్. నీలో కొంచెం మంచితనం ఉంది. నీవాళ్ళకు గౌరవం ఇచ్చే గొప్పదనం వుంది. అందుకే నీతో స్నేహంచేద్దామనుకుంటున్నాను. చేస్తావా?''

అతడి కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

పార్కు పక్కనే ఉన్న రైల్వేట్రాక్ మీదనుంచి ఒక రైలు వేగంగా దూసుకుపోతోంది.

''సారీ నిహా. అయామ్ వెరీ సారీ. ఈరోజు సంధ్య నాకు రాఖీ కట్టలేదు. నువ్వు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్ కట్టినా, ఇది నాకు సంధ్య కట్టిన రాఖీతో సమానం-ఇట్స్‌మై ప్రామిస్'' అంటూ చేయి చాచాడు.

ఆకాశం మరింత చల్లబడింది. నక్షత్రాలు కన్నీరు తుడుచుకుని మరింత మెరుపు తెచ్చుకున్నాయి. అతడి హృదయం తెలియని ఆనందంతో తేలికయింది. ఆమె కళ్ళలో ఆ ఆనందం తాలూకు వెలుగు కనబడింది. ★

**జి. ఎల్.**